సాక్షి బాపట్ల
శనివారం । 8 । జూలై । 2023



బగళాముఖిసేవలో దొంతిరెడ్డి


పిట్టలవానిపాలెం : బాపట్ల జిల్లా చందోలులోని బగళాముఖ అమ్మవారిని శుక్రవారం ఎక్సైజ్ శాఖ కమిషనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు.



బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని పోలీసు అధికారుల విశ్రాంతి భవనం ఆవరణలో బ్యాడ్మింటన్ కోర్టును డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

నమో శాకంబరీ..



సత్తెనపల్లి: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి గుడిలో శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

బస్సుల ద్వారా ప్రయాణికులు తరలింపు



దాచేపల్లి : ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ బోగీల దగ్ధం నేపథ్యంలో నడికుడి రైల్వేస్టేషన్‌లో రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపివేశారు. అందులోని సుమారుగా 350 మంది ప్రయాణికులను 7 బస్సుల ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. రైల్వే అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉంటే ఈ రూట్లో రైళ్లను అధికారులు నిలిపివేశారు.

పోలీసు క్లినిక్‌కు డాక్టర్ నియామకం




నరసరావుపేట: బాపట్ల జిల్లా కనగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.ప్రవంతి పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న పోలీస్ క్లినిక్‌కు మెడికల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలని డాక్టర్ ప్రవంతికి ఎస్పీ సూచించారు.

తుళ్ళూరు మండలంలో 12.4 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్ళూరు మండలంలో 12.4 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా దుగ్గిరాల మండలంలో 0.8 మి.మీ. వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... తాడికొండ 7.2, తాడేపల్లి 6.8, మంగళగిరి 6.6, మేడికొండూరు 3.2, పెదకాకాని మండలంలో 1 మి.మీ చొప్పున వర్షం పడింది.

యార్డులో 36,041 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 33,294 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 36,041 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.11,500 నుంచి 24,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి రూ.25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,772 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.2,200, మోడల్ ధర రూ.1,400 వరకు పలికింది.

మరుపురాని మహానేత

చెదరని నీ చిరునవ్వు జలయజ్ఞ ఫలాలతో సుభిక్షమవుతున్న పంట భూముల్లో నిత్యం తొణికిసలాడుతోంది. నీ సంక్షేమ స్ఫూర్తి సంతోష లక్ష్మియై ప్రతి ఇంటా నాట్యమాడుతోంది. నీ ఆ'కర్షక' రూపం బడిలో.. మడిలో.. జన జీవన స్రవంతిలో.. ప్రతి పేద మదిలో కొలువుదీరి జేజేలు అందుకుంటోంది. నీ ప్రగతి సంతకం నవ్యాంధ్ర అభివృద్ధి ముఖచిత్రంపై తిరుగులేని ముద్రవేస్తోంది. ఎదురు లేని నీ అడుగు జాడ మరో పది అడుగులు ముందుకేసి జగన్నినాదమై మార్మోగుతోంది. అఖిలాంధ్రను బంగారు బాటన పరుగులు పెట్టిస్తోంది. మరణం లేని ఓ మహానేతా.. నీ ఆశయం అజరామరం.. సదాస్మరణీయం నీ మార్గం..

- పులిచింతల కల నెరవేర్చిన జనాకర్షక నేత
- పంట కాలువల ఆధునికీకరణకు ఆద్యుడు
- ఆయన పాలన స్వర్ణయుగం
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవం
- బాపట్ల జిల్లాపై బలమైన ముద్రవేసిన సంక్షేమశీలి

మదిమదిలో.. జనహృదిలో..



జన నీ'రాజ'నం : నిజాంపట్నంలో వైఎస్సార్‌పై ప్రజల పూలవర్షం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ''ఎన్నికల ముందు నేను చేసిన వాగ్దానం ప్రకారం రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించే ఫైలుపై తొలి సంతకం చేస్తున్నాను''. అంటూ తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే సంక్షేమానికి నాంది పలికారు వైఎస్ రాజశేఖరరెడ్డి. ఒకే ఒక్క నిమిషంలో.. ఒక్క మాట ద్వారా.. ఒక్క సంతకం ద్వారా.. తానేమిటో, తన విశ్వశనీయత ఏమిటో చేసిన వాగ్దానాల పట్ల నిబద్ధత, ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి, ఖచ్చితత్వాలు ఎంతటివో చెప్పకనే చెప్పారు ఆయన. అనంతరం కాలంలో సంక్షేమం, అభివృద్ధికి నిలువెత్తు సాక్ష్యంగా ఆయన పాలన సాగింది. జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఇందిరక్రాంతి, రూ.2కే కిలో బియ్యం, ఇందిరప్రభ, రాజీవ్‌గృహకల్ప, రాజీవ్ యువశక్తి, ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర పథకాలతో జనజీవితాల్లో వెలుగులు నింపింది. ఆనందాంధ్రను సాకారం చేసింది. మరీ ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లా.. కొత్తగా ఏర్పాటైన బాపట్ల జిల్లాలోని నియోజకవర్గాలను ప్రగతి బాట పట్టించింది. జన హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా బాపట్ల జిల్లాలో వైఎస్సార్ వేసిన అభివృద్ధి అడుగు జాడలపై ప్రత్యేక కథనం.



జలయజ్ఞ ఫలం : వైఎస్సార్ హయాంలో సాగులోకి వచ్చిన పొలం

- జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పులిచింతల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి భూములను వైఎస్సార్ సస్యశ్యామలం చేశారు.
- అద్దంకి నియోజకవర్గంలో భవనాశి రిజర్వాయర్, కొరిశపాడు ఎత్తిపోతల, ఎర్రంచినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాలకు వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. వాటిలో కొంతమేర పనులు జరగ్గా వైఎస్ మరణం తరువాత పనులు నిలిచిపోయాయి.
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే సాగునీటి పథకాల పనులు వేగవంతం చేశారు. కొరిశపాడు పనులు దాదాపు పూర్తికాగా, ఎర్రంచినపోలిరెడ్డి ఎత్తిపోతల పనులు 75 శాతం పూర్తయ్యాయి.
- అద్దంకి నియోజకవర్గ పరిధిలో రూ.1,100 కోట్లతో మేదరమెట్ల–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పనులు వైఎస్సార్ పూర్తిచేశారు.
- పర్చూరు నియోజకవర్గంలో రూ.400 కోట్లతో నాగార్జున సాగర్ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టి ఆయకట్టుకు నీరందించిన ఘనత వైఎస్సార్‌కే దక్కింది. బకింగ్‌హామ్ కెనాల్, ఓగేరు వాగు, పర్చూరు వాగుల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టారు. పర్చూరు–చీరాల రోడ్డు పనులు పూర్తిచేశారు.
- చీరాల నియోజకవర్గంలో కృష్ణా డెల్టా ఆధునికీకరణ పనులకు రూ.2 వేల కోట్లు కేటాయించారు. చేనేతలకు 50 ఏళ్లకే పింఛన్‌ను అందజేశారు. చిలపనూలుపై ఉన్న 22 శాతం ఎక్సైజ్ సుంకాన్ని వైఎస్సార్ రద్దు చేశారు. రంగు, రసాయనాలు, నూలుకు 10 శాతం సబ్సిడీ ఇచ్చారు.
- బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి వైఎస్సార్ కృషిచేశారు. ప్రధానంగా నియోజకవర్గంలోని కర్లపాలెం మొదలుకొని తీరప్రాంతంలోని వేలాది ఎకరాల ఇసుక భూములు బీళ్లుగా ఉండేవి. వైఎస్ హయాంలో రైతులకు ఉచిత విద్యుత్ అందించి ఆ భూములను సాగులోకి తెచ్చారు.



- రేపల్లె నియోజకవర్గంలో కృష్ణాడెల్టా ఆధునికీకరణ, పంట కాలువలు, డ్రెయిన్ల పనులతోపాటు కరకట్ట, రోడ్ల నిర్మాణాలు వైఎస్సార్ పూర్తిచేశారు.
- వేమూరు నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. రూ.వేల కోట్లు వెచ్చించి అన్ని నియోజకవర్గాల్లో తారు, సిమెంటు రోడ్లను నిర్మించారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదల ప్రాణాలను నిలబెట్టారు. వేలాది మంది రైతులకు రుణవిముక్తి కలిగించారు. మహిళలను ఆదుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు తోడ్పాటు అందించారు. వృద్ధులకు పింఛన్లు ఇచ్చి ఆదుకున్నారు. ప్రతి పేదవాడికి ఇంటిని నిర్మించి ఇచ్చారు. అందుకే వైఎస్సార్ జనం గుండెల్లో దేవుడయ్యాడు. ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రిబాటలో నడుస్తూ జనరంజక పాలన సాగిస్తున్నారు.

24 గంటల్లోనే హత్య కేసును ఛేదించిన పోలీసులు

సత్తెనపల్లి: ఆస్తిని కాజేయాలనే ఉద్దేశంతో పథకం ప్రకారం సత్తెనపల్లి మండలం దూళిపాళ్లకు చెందిన షేక్ రహీమున్, షేక్ మాలింబి, షేక్ రహిమాన్‌ను హత్య చేశారని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ తెలిపారు. ముగ్గురి హత్య ఘటన జరిగిన 24 గంటల్లోపు నిందితులు షేక్ ఖాసిం, షేక్ జాకీర్, షేక్ సుఫియాలను పట్టణంలోని 27వ వార్డు పెద్ద మసీదు సమీపంలో శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని చెప్పారు. ముగ్గురిని హతమారిస్తే ధూళిపాళ్లలోని రెండు ఎకరాల పొలం, రేకుల ఇల్లు సొంతం చేసుకోవచ్చనే ఉద్దేశంతో గ్రామంలో తమ ఇంటిలో ఉన్న షేక్ రహీమున్, ఆమె కుమార్తె షేక్ మాలింబిని బంధువులైన మసీద్ ఇమాంషా, మసీద్ అబ్దుల్ సర్దార్, సయ్యద్ మౌలాలి, చుట్టుపక్కల వాళ్లు చూస్తుండగానే కత్తులతో దాడి చేసి హతమార్చారని వివరించారు. షేక్ రహిమాన్‌ను సత్తెనపల్లి శివారులోని కేఎస్‌పీ దాబా వెనక్కు తీసుకొని వెళ్లి మెడకు నవారు, వైరు బిగించి లాగి ఊపిరాడకుండా చేసి హత మార్చారని తెలిపారు. హత్యలో భాగస్వాములైన ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని చెప్పారు. కేసులో సత్తెనపల్లి రూరల్ సీఐ సీహెచ్ కోటేశ్వరరావు, సత్తెనపల్లి టౌన్ సీఐ యు.శోభన్‌బాబు, సత్తెనపల్లి రూరల్ ఎస్‌ఐ ఆవుల బాలకృష్ణతో పాటు రాజుపాలెం, నకరికల్లు, సత్తెనపల్లి టౌన్ ఎస్‌ఐలు సహకరించినట్లు డీఎస్పీ తెలిపారు.

గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఓగా షేక్ షహబాజ్



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని సీనియర్ డీసీఓగా షేక్ షహబాజ్ హనూర్ ను నియమిస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ఆయన గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని డీఆర్ఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీనియర్ డీసీఓగా ఉన్న ఎ.సీతాశ్రీనివాస్ ఉద్యోగ విరమణ చేశారు.

ఉపాధి నేస్తంపై ఉన్మాదం

- పచ్చపత్రికల పిచ్చి రాతలు
- అక్రమాలంటూ గగ్గోలు
- పనుల్లేక వలసలంటూ కట్టుకథనాలు
- పనికిరాకున్నా మస్టర్ వేశారని అధికారులపై నిందలు
- బోగస్ పేర్లతో నేతలు, సిబ్బంది నిధులు బొక్కారని అసత్య ఆరోపణలు



జిల్లాలో ఉపాధిహామీ పనిచేస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఉపాధి, సంక్షేమ ప్రభుత్వంపై ఎల్లోమీడియా విషం చిమ్ముతూనే ఉంది. తాజాగా ఉపాధి హామీ పనుల్లో అక్రమాలంటూ, నిధులు బొక్కారంటూ అసత్య కథనాలు వండివార్చింది. సీఎం సభలకు ఉపాధి కూలీలను తరలిస్తున్నారని, పనుల్లేక కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల ఫొటోలతో అసత్యాలు పోగేసి కట్టుకథలు అల్లింది. పచ్చ పత్రికల విషపురాతలను డ్వామా పీడీ శంకర్‌నాయక్ తీవ్రంగా ఖండించారు. జిల్లాలో రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా ఉపాధిహామీ పనులు చేపట్టినట్లు ఆయన 'సాక్షి'కి తెలిపారు.

రికార్డు స్థాయిలో పనులు

జిల్లాలో ఉపాధిహామీ పనులు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 73 లక్షల పని దినాలు కల్పించాలన్నది లక్ష్యంకాగా ఇప్పటివరకూ 57,67,000 పనిదినాలు కల్పించారు. లక్షా 57 వేల కుటుంబాల్లోని 2,72,000 మంది కూలీలకు పని కల్పించారు. గత మూడునెలల ఆరు రోజులలో రూ.176 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కూలీలకు వేతనాల కింద రూ.140 కోట్లు, మెటీరియల్ కింద రూ.33.16 కోట్లు వెచ్చించారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి నూరురోజుల పని కల్పన లక్ష్యం కాగా, ఇప్పటికే 37 రోజులు పనికల్పించారు. పనిచేసిన కూలీలలో ఎస్సీలు 36.26 శాతం, ఎస్టీలు 3.38 శాతం, మహిళలు 53.65 శాతం ఉండగా, 2,024 మంది వికలాంగులకు ఉన్నారు. పైగా పనులు అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా బ్లూఫ్రాగ్ యాప్ ద్వారా చేపడుతన్నారు. దీని వల్ల అన్ని స్థాయిల అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. ఎక్కడా అక్రమాలకు చోటు ఉండదు. అయినా పచ్చపత్రిక వాస్తవాన్ని పక్కనబెట్టి తనకు అనుకూల పైత్యం ప్రదర్శించింది.

వలసలు లేవు, అక్రమాలు జరిగే ఆస్కారం లేదు



ఉపాధి పథకంలో అక్రమాలు జరిగే ఆస్కారం లేదు. దీనికి పకడ్బందీ ఆన్‌లైన్ వ్యవస్థ ఉంది. సీఎం సభలకు ఉపాధి కూలీలను తరలిస్తున్నామన్నది పూర్తిగా అసత్యం. సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరి ప్రమేయం లేకుండానే సభలకు వెళ్తున్నారు. వలసల వార్తలూ అబద్ధమే. రైల్వేస్టేషన్లలో, బస్టాండ్లలో ఫొటోలు తీసి వలసలు అంటూ రాయడం సబబు కాదు.

– శంకర్‌నాయక్, పీడీ డ్వామా, బాపట్ల జిల్లా

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

మరో ఐదుగురికి గాయాలు



ఘటనా స్థలంలో తల్లిఒడిలో ఉన్న చిన్నారి మహబూబ్

పర్చూరు (చినగంజాం): ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ చిన్నారి తనువు చాలించాడు. ఈ ఘటన పర్చూరు పాలిటెక్నిక్ కాలేజీ వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం అమీనాబాద్‌కు షాజిదా శుక్రవారం తన కుమారుడు మహబూబ్ (5), ఇతర బంధువులతో కలిసి మొక్కు తీర్చుకునేందుకు వాడరేవుకు ఆటోలో బయలుదేరారు. ఆటో పర్చూరులోని పాలిటెక్నిక్ కాలేజీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన కారు బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో చిన్నారి మహబూబ్ తలకు తీవ్రంగా గాయాలు కాగా అతనితో పాటు బంధువులు మరో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. కారు పల్టీలు కొట్టి పక్కనే ఉన్న వాగులో పడిపోయింది. ప్రమాద సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఎన్.చెంచు ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మార్గం మధ్యలో చిన్నారి మహబూబ్ మృతిచెందాడు. చిన్నారి మృతితో తల్లి తోపాటు కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు. సౌదీలో ఉన్న తండ్రి కరీముల్లా విషయం తెలుసుకొని తీవ్రంగా రోదించారు.

వ్యవసాయ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో చేరేందుకు ఈనెల 8వ తేదీ నుంచి 26వ తేదీ దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల డీన్ డాక్టరు వై.రాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎంసెట్ ఫలితాల్లో అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

మన'సారా' వదిలేయండి

- సమాజ హితం కోరుతూ జీవించండి
- ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు రూ.22.30లక్షలు అందజేత



చెక్కు అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల: సమాజహితం కోరుతూ జీవించటంతోపాటు జీవనశైలిలో మార్పు రావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు.సారా కాస్తూ పట్టుబడిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధికల్పనపై స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం జరిగింది. 19 కుటుంబాలకు రూ.22.30 లక్షల నగదును చెక్కుల రూపంలో కలెక్టర్, ఎస్పీ వకుల్ జిందాల్ చేతులమీదుగా అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను సారా రహితంగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. సారా వ్యాపారాలను వదిలి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఎదగాలని ఆకాంక్షించారు. సొంత ఇళ్లు లేకపోతే నివాస స్థలం నెలరోజుల్లో కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ దిశగా ఆదేశాలు జారీ చేశారు. బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని అధికారులకు సూచించారు.

సారా తయారీ, విక్రయం చట్టరీత్యానేరం

సారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సారా తయారీని పూర్తిగా విడిచిపెట్టాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి.అర్జునరావు, ఎల్‌డీఎం ఎం.శివకృష్ణ, ఎస్ఈబీ సహాయ సూపరింటెండెంట్ జి.నరసింహారావు, బ్యాంకు అధికారులు, డీఆర్‌డీఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో గీత దాటితే వేటు



సూర్యలంకలో పద్మావతి రెస్టారెంట్ నిర్వాహకులకు నోటీస్‌ను అందజేస్తున్న దృశ్యం



సూర్యలంకలో టోల్ గేట్ వద్ద రశీదులను పరిశీలిస్తున్న బాపట్ల ఎంపీడీఓ రాధాకృష్ణ, ఈవోపీఆర్డీ శరత్

- సాక్షి కథనానికి స్పందన
- పార్కింగ్ నిబంధనలు పాటించకపోతే చర్యలు
- పద్మావతి రెస్టారెంట్ కు నోటీసులు

సాక్షి స్పందన

బాపట్ల అర్బన్: సూర్యలంక తీరాన నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై అధికారులు కొరఢా ఝుళిపించారు. సాక్షి పత్రికలో 'అలవోకగా దోపిడి' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో రాధాకృష్ణ, ఈఓపీఆర్డీ పులి శరత్ బాబు స్పందించారు. సూర్యలంక చేరుకున్న అధికారులు పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి బిల్లులే సరిగా లేకుండా అడ్డగోలుగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుల్లో ఎలాంటి తేడాలు ఉన్నా సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వాహనదారులకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. పార్కింగ్ కోసం వచ్చే వాహనాలను తాడు అడ్డుగా పెట్టి ఆపితే సహించబోమని హెచ్చరించారు. మరోసారి ఇది పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఫుడ్ సేఫ్టీ నిబంధనలపై నోటీసులు

సూర్యలంక తీరాన పద్మావతి రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు గరికపాటి ప్రభాకర్ రావు, దేవరాజు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్‌లోని వంటశాల, వంట పాత్రలు తనిఖీ చేశారు. ఆహార భద్రత ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్థాలను తనిఖీ చేసిన అధికారులు రెస్టారెంట్ యజమానికి నోటీసులు జారీ చేశారు. మరోసారి ఇదే పరిస్థితి ఎదురైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆకతాయిలపై ప్రత్యేక నిఘా పెట్టాలి

- రౌడీషీటర్లు, పాతనేరస్తుల కదలికలపై దృష్టి సారించాలి
- గస్తీ వ్యవస్థను పటిష్టపర్చాలి
- కేసుల విచారణ వేగవంతం చేయాలి
- నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్ : కళాశాలలు.. పాఠశాలలు విడిచి పెట్టే సమయంలో విద్యార్థినులను వేధించే ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిపోర్ట్ ఇచ్చినప్పుడు మనం స్పందించే విధానం, వారు ఇచ్చిన రిపోర్ట్‌పై తీసుకునే చర్యలు అత్యంత కీలకమన్నారు. ఫిర్యాది రిపోర్ట్‌పై వెంటనే కేసు రిజిస్ట్రేషన్ చేసి విచారణ చేయాలన్నారు. ఏదైన చిన్న ఘటన జరిగినా దాని పట్ల అలసత్వం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా విచారించి పరిష్కరించాలన్నారు. జిల్లాలో పూర్తిస్థాయిలో గంజాయి కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్ర నేరాలకు, దొంగతనాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై పోలీస్ స్టేషన్లో షీట్ ఓపెన్ చేయాలన్నారు. రాత్రిపూట గస్తీ పటిష్టంగా నిర్వహించినప్పుడే దొంగతనాలు, ఇతర నేరాలను కట్టడి చేయగలమన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే గడచిన ఆరు నెలలలో దొంగతనాలు చాలా వరకు తగ్గాయన్నారు.

సమావేశం ముగిసిన అనంతరం ఎక్కువ సంఖ్యలో దిశ యాప్‌లను డౌన్లోడ్ చేయించిన బాపట్ల రూరల్ సీఐ, మార్టూరు సీఐ, ఎస్‌ఐలను, ఇంకొల్లు సీఐ, ఎస్‌ఐలను అద్దంకి ఎస్‌ఐ, అలాగే పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించిన చందోలు ఎస్‌ఐ సంతమాగులూరు ఎస్‌ఐలను, డయల్ 100 కాల్ కి వేగంగా స్పందించిన చోడాయపాలెం ఎస్‌ఐను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ బాపట్ల, చీరాల, రేపల్లె డిఎస్పీలు టి. వెంకటేశులు, ఎస్. ప్రసాద్‌రావు, టి.మురళీకృష్ణ ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీ ఏ.వి రమణ, ఎస్‌బి సీఐ ఎ. శ్రీనివాస్, డీసీఆర్‌బి సీఐ పి. బాలమురళీకృష్ణ, జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పోలీస్ వాహనాలు కండీషన్‌లో ఉండాలి

పోలీస్ వాహనాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీస్ వాహనాలు అనునిత్యం కండీషన్‌లో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత పోలీస్ అధికారులపై ఉందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వాహనాల పనితీరు, వాటి నిర్వహణను పరిశీలించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహనాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు. వాహనాలకు పెయింటింగ్, పోలీసు స్టిక్కర్స్, అత్యవసర హారన్ సక్రమంగా అమర్చుకోవాలన్నారు. పోలీస్ అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సొంత వాహనంలా చూసుకోవాలన్నారు. పోలీస్ వాహనాల నిర్వహణ, లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ సమగ్ర నివేదికను అందించాలన్నారు. అనంతరం వాహన నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించి, వాహనాన్ని మంచి కండిషన్, పరిశుభ్రంగా ఉంచుకున్న వాహన డ్రైవర్‌లను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ ఎండిహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బి సీఐ ఎ. శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ బి. శ్రీకాంత్ నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మధరావు పాల్గొన్నారు.



పోలీస్ వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

ఫిష్ ఆంధ్రాతో మెరుగైన ఉపాధి అవకాశాలు

మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు : ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంతోపాటు, ఆక్వా రైతులకు గిట్టుబాటు కల్పించే ఆలోచనలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించిన ఫిష్ ఆంధ్రా డొమెస్టిక్ మార్కెటింగ్‌లో భాగమైన మిని ఫిష్ రిటైల్ అవుట్ లెట్‌ల ద్వారా నాణ్యమైన చేపలు ప్రజలకు అందుబాటులో ఉండటం హర్షించదగిన అంశమని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం దోనేపూడి శివారు మగ్గాలపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ రిటైల్ అవుట్ లెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా అవుట్ లెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. దోనేపూడిలో కొమరాబత్తిని సుజాత ఏర్పాటు చేసిన అవుట్ లెట్‌కు రూ. 1.19 లక్షలు యూనిట్ కాస్ట్ ఉండగా 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ కల్పించినట్లు తెలిపారు. కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు మండలాలలో 11 యూనిట్‌లు ఏర్పాటుకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి వాగోలు గౌతమి, ఎంపీటీసీ సభ్యుడు ఇంటూరి ప్రవీణ్, గ్రామ మత్స్య సహాయకురాలు కె. రత్నమాధురి, వైఎస్సార్ సీపీ నాయకులు వెనిగళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఫిష్ రిటైల్ అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

మంత్రి అంబటి రాంబాబు

ముప్పాళ్ల: పేదల విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ సామాన్యులకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ముప్పాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దాతల సాయం రూ.15లక్షలతో నిర్మిస్తున్న మీటింగ్ హాలు నిర్మాణానికి కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో కలసి మంత్రి భూమిపూజలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు పట్టించుకోని విద్య, వైద్యంపైన జగనన్న ప్రత్యేక దృష్టి పెట్టి నాలుగు సంవత్సరాల్లో అనేక ఆసుపత్రుల రూపురేఖలు మార్చారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై నమ్మకం పెంచేలా సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పాటు ప్రేమ, ఆప్యాయతతో పనిచేస్తే ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే అమ్మఒడి ద్వారా నిరక్షరాస్యత శాతం తగ్గుతోందని తెలిపారు. గ్రామాల్లో కొన్ని పనులకు దాతల సాయం ఉండాల్సిందేనని, అన్నీ ప్రభుత్వమే చేయాలనుకోవడం సరైంది కాదని చెప్పారు. ఈ సందర్భంగా మీటింగ్ హాలు నిర్మాణానికి తోడ్పాటు అందించిన కంచర్ల కృపారావు, మణిరావు దంపతుల్ని అభినందించారు. కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మంచి అభిప్రాయం ఏర్పడేలా వైద్య సిబ్బంది పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిపించాలని, మరో మూడు నెలల్లో ముప్పాళ్ల పీహెచ్‌సీలో పది పడకలతో అదనపు సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. ఎన్‌ఆర్‌ఐలు కంచర్ల కృపారావు, మణిరావు దంపతుల్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ అసోసియేషన్ సలహాదారు బాలస్వామి, ఎన్‌ఆర్‌ఐలు కంచర్ల కృపారావు మాట్లాడారు. పీహెచ్‌సీలో నూతనంగా నిర్మించిన తల్లీబిడ్డా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇటీవల కేంద్ర వైద్య సిబ్బంది పీహెచ్‌సీని సందర్శించి అందించిన ఎన్‌కాస్ సర్టిఫికెట్‌ను కలెక్టర్ శివశంకర్, మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా వైద్యాధికారి రమాదేవి స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారూరి పద్మ, అదనపు డీఎంహెచ్‌వో జి.చంద్రశేఖర్, సర్పంచ్ సతీష్, వైస్ ఎంపీపీ రాయన్న, వైద్యులు జయకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ శివశంకర్

ముస్లిం, మైనార్టీలను ఆదుకున్న నాయకుడు సీఎం జగన్

చినగంజాం/కారంచేడు: ముస్లిం, మైనార్టీలను ఆదుకున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ నజీర్ అహ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గద్దం మస్తాన్‌వలి అన్నారు. 'హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా ముస్లిం, మైనార్టీ నాయకులు పర్చూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో మసీదులను సందర్శించి ఆయా మసీదు కమిటీలతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మసీదు మరమ్మతులు, శ్మశానం ప్రహరీ నిర్మాణం, ఈద్గా కోసం స్థలం, డ్రైనేజీ సమస్యల గురించి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని యద్దనపూడి, పర్చూరు, చినగంజాం, కారంచేడు మండలాల్లో పర్యటించి ఆయా మసీదులలో ముస్లింల సమస్యలను, ఇమాం, మౌజన్‌లతో మాట్లాడారు. గుర్తించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారం చేస్తానని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కారంచేడు మండల కో–ఆప్షన్ సభ్యుడు ముల్లా నూర్ అహ్మద్, మైనార్టీ నాయకులు బషీర్, పర్చూరు మండల కో–ఆప్షన్ సభ్యులు హెచ్ కాలేషా, బషీర్, మసీదు పెద్దలు, ముత్తువల్లి మౌజన్ పాల్గొన్నారు.



దగ్గుబాడులో ఇమాంలు, మౌజన్‌లతో ముస్లిం, మైనార్టీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని జొన్నతాళి సెంటర్‌ల జరిగింది. ఎస్ఐ కే కమలాకర్ వివరాల మేరకు.. బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి చెందిన రహంతుల్లా (45), హుస్సేన్‌లు జొన్నతాళి సమీపంలో గ్రానైట్ ముడిరాయిని ఫెన్సింగ్ రాళ్లుగా మార్చి విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈక్రమంలో వీరిద్దరూ స్కూటీపై స్వగ్రామం నుంచి వేరే గ్రామానికి వెళ్లే క్రమంలో వీరి వాహనాన్ని వెనుక నుంచి బోర్‌వెల్ లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో రహంతుల్లా అక్కడికక్కడే మృతి చెందగా, తలకు తీవ్రగాయమైన హుస్సేన్‌ను హైవే సిబ్బంది అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ ఫిరోజ్, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ అవరోధాలు లేకుండా చేశారు. రహంతుల్లా మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రమాద స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్సైలు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామానికి చెందిన 16 కుటుంబాలు టీడీపీని వీడి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. ఇందులో గ్రామానికి చెందిన బోయిన శివ, ఇండ్ల శ్రీనివాసరావు, బయినబోయిన రాజు, బయిన బోయిన ఆవులయ్య, దొడ్డా వెంకటరామయ్యతో పాటు మరో పది కుటుంబాలు ఉన్నాయి. పార్టీ గ్రామ నాయకులతో వారంతా మాచర్ల తరలివెళ్లి ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రభుత్వ విప్ పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న సంక్షేమ పథకాలతో పాటు ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునే ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నాయకత్వం నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, చీతిరాల వెంకటకోటేశ్వరరావు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

సబ్సిడీపై రూ.50కే కిలో టమాటాలు

నరసరావుపేట: బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలు ఎక్కువగా ఉండడంతో సబ్సిడీపై ప్రభుత్వం కిలో రూ.50కే అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డులో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సబ్సిడీ విక్రయ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుతో కలిసి ఎమ్మెల్యే రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టమాటా ధర పెరుగుతున్నందున ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని వివరించారు. కోవిడ్ సమయంలో టమాటా, ఉల్లిపాయలను సబ్సిడీపై పంపిణీచేసిన విషయాన్ని గుర్తుచేశారు. నరసరావుపేటకు 1,500 కిలోల టమాటాలు వచ్చాయని, మూడురోజులపాటు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అగ్రికల్చరల్ ట్రేడ్ మార్కెట్ ఆఫీసర్ కె.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం జిల్లాకు ఐదు టన్నులు కేటాయించిందన్నారు. చిలకలూరిపేటకు రెండు టన్నులు, నరసరావుపేట, సత్తెనపల్లికి 1.5టన్నులు సరఫరా చేసినట్టు వివరించారు. చిలకలూరిపేట, సత్తెనపల్లిల్లో రైతుబజార్లలో విక్రయిస్తుండగా నరసరావుపేటలో మార్కెట్‌యార్డులో కేంద్రం ఏర్పాటు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, యార్డు కార్యదర్శి సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కనకా పుల్లారెడ్డి, మూరే రవీంద్ర, పూనూరి కోటిరెడ్డి పాల్గొన్నారు.



టమాటా విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, జేసీ శ్యామ్‌ప్రసాద్

కర్రసాము పోటీల్లో సత్తా చాటారు

- 5 గోల్డ్, 3 బ్రాంజ్ మెడల్స్ కైవసం
- పోర్చుగల్‌లో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

పెదకాకాని: జాతీయస్థాయి మ్యూజికల్ ఫార్మ్ కర్రసాము పోటీల్లో ఆంధ్ర క్రీడాకారులు 5 బంగారు, 3 రజిత పతకాలు సాధించారు. ఈనెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నందు జాతీయస్థాయి వాకో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భాగమైన మ్యూజికల్ ఫార్మ్ కర్ర సాము పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుండి కర్ర సాము కోచ్ ఖరీదు సాంబయ్య సారథ్యంలో క్రీడాకారులు పాల్గొన్నారు. గత మే నెలలో వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించిన మ్యూజికల్ ఫామ్ కర్ర సాము పోటీల్లో ప్రతిభ కనబరిచి సీనియర్ విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సంగతి విదితమే. సీనియర్ విభాగంలో జాతీయస్థాయి మ్యూజికల్ ఫార్మ్ కర్ర సాము పోటీల్లోనూ చత్తా చాటారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన సింగిల్, గ్రూప్ ఈవెంట్లలో ప్రతిభ కనబరిచి కొర్రపాటి చంద్రశేఖర్ రెండు గోల్డ్ మెడల్స్, ఖరీదు సాంబయ్య ఒక గోల్డ్ మెడల్ ఒక బ్రాంచ్ మెడల్, పత్తి పవన్ కుమార్ ఒక గోల్డ్ మెడల్ ఒక బ్రాంజ్ మెడల్, మట్టుపల్లి తరంగణి సింగ్ ఒక గోల్డ్ మెడల్ ఒక బ్రాంచ్ మెడల్ సొంతం చేసుకున్నారు. ఈ పోటీలకు 23 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పతకాలు సాధించిన అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ వాక్కు ఇండియా వాకో ఇండియా ప్రెసిడెంట్ ఆనంద్ బాలు, సెక్రటరీ కె.నరేంద్ర అభినందించారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించిన ఈ క్రీడాకారులు నవంబర్ నెలలో పోర్చుగల్ దేశంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు.



కర్ర సాము పోటీల్లో సాధించిన పతకాలతో క్రీడాకారులు సాంబయ్య, చంద్రశేఖర్, పవన్

తెలంగాణ మద్యం సీజ్

క్రోసూరు: అచ్చంపేట మండలం పులిచింతల డ్యాం వద్ద కారులో తరలిస్తున్న తెలంగాణ మద్యం సీసాలతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అచ్చంపేటకు చెందిన రామిశెట్టి కోటేశ్వరరావు, షేక్ రబ్బానీని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 212 మద్యం సీసాల్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

జాతీయ అవార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: జాతీయస్థాయిలో దివ్యాంగులకు ప్రత్యేకంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి సాధికారతకు కృషి చేస్తున్న దివ్యాంగులు, వ్యక్తులు, సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డిజేబుల్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్ సువార్త శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గలవారు ఈనెల 31వ తేదీలోగా www.awardr.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి డిసెంబర్ 3 అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం రోజున జాతీయ అవార్డుల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు వెబ్సైట్ను సందర్శించాలన్నారు.

రూ.130 కోట్లతో ఎంటీఎంసీ అభివృద్ధి

తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి కేటాయించి నిధులు కేటాయించారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. దుగ్గిరాల గ్రామ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌కు రూ.130 కోట్లు కేటాయించారని, ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, గత నెల రోజుల కిందట దుగ్గిరాల మండలానికి కూడా ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరడంతో రూ.50 కోట్లు కేటాయించారని తెలిపారు. మరో 15రోజుల్లో ఆ నిధులు విడుదల అవుతాయని అన్నారు. నందివెలుగు నుంచి మంగళగిరి వరకు ఉన్న రహదారిని అభివృద్ధి చేసేందుకు రూ.6.5 కోట్ల మంజూరయ్యాయని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అవినాష్ గుప్తాను అరెస్టు చేయాలి

మంగళగిరి: ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులపై అతి కిరాతకంగా దాడి చేసి దుర్భాషలాడిన అవినాష్ గుప్తాను వెంటనే అరెస్టు చేయాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నగరంలోని మార్కండేయ కళ్యాణ మండపంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. చేనేత సంఘం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ చేనేతల వద్ద వస్త్రాలు కొనుగోలు చేసి వ్యాపారం చేసుకుంటూ తమ వద్ద తీసుకున్న వస్త్రాలకు నగదు అడిగేందుకు వెళ్లిన ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులను దుర్భాషలాడటమే కాకుండా వీడియోను కూడా సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ అధికార మదంతో విర్రవీగుతున్న అవినాష్ గుప్తాను అరెస్టు చేయాలని, లేకుంటే చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామన్నారు. చేనేతలపై జరిగే దాడులను సుమోటోగా స్వీకరించి దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. దాడికి నిరసనగా సోమవారం చేనేత వస్త్రాలయాలు, మాస్టర్స్ వీవర్స్ చేనేత ఉపవృత్తులు, చేనేతవృత్తుల వారు షాప్‌లను బంద్ చేసి భారీ ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు పునరావృత్తమైతే రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలందరూ కలసి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, జొన్నాదుల మణి, రామనాథం పూర్ణచంద్రరావు, దోకుపర్తి రామారావు, కూరపాటి కోటేశ్వరరావు, బత్తూరి మోహనరావు, కొలుసు రవి, స్వరం పుల్లారావు, రామచంద్రరావు, పచ్చల నాగేశ్వరరావు, రామనాథం పరమేశ్వరరావు, భీమిశెట్టి బాలేశ్వరరావు, గజపల్లి వెంకట కృష్ణారావు, దొడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.



ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులపై దాడులను నిరసిస్తూ నినదిస్తున్న నాయకులు

తాగునీటి కోసం రూ. 218 కోట్లు మంజూరు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు రూ. 218 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణానికి రూ. 120 కోట్లు, దాచేపల్లి పట్టణానికి రూ. 16.5 కోట్లు, గురజాల పట్టణానికి రూ. 8.5 కోట్లు, గురజాల నియోజకవర్గంలోని 57 గ్రామాలకు రూ. 73 కోట్లు కలిపి మొత్తం రూ. 218 కోట్లు మంజూరయ్యాయని తెలియజేశారు. జలదీక్ష కార్యక్రమం ద్వారా మాచవరం మండలంలోని తురకపాలెంలో వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని 200 ఇళ్లకు పైపులైన్ ద్వారా వాటర్ కనెక్షన్ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలో సెకెండ్ ఫేజ్‌లో 1500 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనే పిడుగురాళ్ల పట్టణంలోనే ప్రథమంగా ఇస్తున్నామని తెలిపారు. గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. టీడీపీలో 30 ఏళ్లుగా ఉన్న యరపతినేని శ్రీనివాసరావు చేయలేని అభివృద్ధిని తాము 30 నెలల్లోనే చేసి చూపించామని తెలిపారు. ప్రతిసారీ యరపతినేని గురజాలలో పోటీ చేయి అని అనడం హాస్యాస్పందంగా ఉందని, మళ్లీ పోటీ చేసేది తానేనని, గెలిచేది తానేనని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి స్పష్టం చేశారు.